
ఈనాడు
యాదాద్రి భువనగిరి

స్వర్ణ తాపడం పనులు ఫిబ్రవరిలో పూర్తి


ఆలయ విమానం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: తెలంగాణలో స్వర్ణ విమానం(గోపురం) గల దేవాలయంగా యాదాద్రి పుణ్యక్షేత్రం చరిత్రకెక్కనుందని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు.. విమానం స్వర్ణ తాపడం పనులు వచ్చే ఫిబ్రవరి నెల 15 లోగా పూర్తవుతాయని వివరించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వర్ణమయంగా రూపొందిన విమానం తీర్థజనులు దర్శించుకోవచ్చని వెల్లడించారు. 60 కిలోల బంగారంతో రాగి తొడుగులకు పుత్తడి పూత పూసే పనులు చెన్నైలో స్మార్ట్ క్రియేషన్స్ విజయదశమి పర్వదినం రోజు శ్రీకారం చుట్టిందన్నారు. తొలిగా 12 కిలోల బంగారం అందజేశామని, రెండో దఫా నవంబరు 1వ తేదీన ముట్టజెప్పుతామన్నారు. బంగారు విమానానికి భక్తుల నుంచి విరాళాల సేకరణ కొనసాగిస్తామని చెప్పారు.

దాత విరాళం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమానం స్వర్ణమయం చేసే క్రతువు కోసం హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీకి చెందిన దాత రామకృష్ణారెడ్డి లింగారెడ్డి రూ.2,00,116లను విరాళాన్ని చెక్కు బుధవారం ఆలయ ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. దాతకు దైవ దర్శనం కల్పించి, ఆశీస్సులు అందజేశారు.

గోదాముల కోసం వెతుకులాట


వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు

భువనగిరి, న్యూస్‌టుడే:

కొనుగోలు చేసిన ధాన్యం గోదాముల్లో నిల్వ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్ కోసం మిల్లర్లకు ఇవ్వొద్దని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మార్కెటింగ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, పౌరసరఫరాల సంస్థ, ప్రైవేట్ గోదాములకు తరలించాలన్న ఆదేశంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే జిల్లాలో స్థలాభావ సమస్య నెలకొనగా.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అధికారులు తలపట్టుకున్నారు. గోదాముల కోసం వెతుకులాట పనిలో ఉన్నారు.

★ ఈ సీజన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 6.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ఇందులో రైతులు సొంత అవసరాలు, మిల్లర్లు కొనుగోలు చేయగా సన్న, సాధారణ రకం కలిపి 4లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వ కొనుగోలు సంస్థలకు విక్రయిస్తారని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 368 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యానికి విడివిడిగా గోదాముల్లో నిల్వ చేయనున్నారు.

లభ్యత లక్ష ఎంటీలకే

కొనుగోలు లక్ష్యం నాలుగు లక్షల ఎంటీలు కాగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ గోదాముల్లో కేవలం లక్ష వరకే స్థలం లభ్యత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడ నిల్వచేయాలన్న విషయమై తర్జనభర్జన పడుతున్నారు.

★ జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ శాఖకు చెందిన 18 గోదాములు ఉన్నాయి. వాటి నిల్వ సామర్థ్యం సుమారుగా 80 వేల ఎంటీలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 66,166 ఎంటీల అద్దెకు తీసుకున్నారు. వారిని ఖాళీ చేయించాలని మార్కెట్ కార్యదర్శులకు ఆదేశించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సబిత 'న్యూస్‌టుడే'గా తెలిపారు.

సమగ్ర నివేదిక సమర్పిస్తున్నాం

– జగదీశ్వర్, డీఎం, పౌర సరఫరాల సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా

ప్రస్తుతానికి జిల్లాలో సమీకృత, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో సుమారు లక్ష మెట్రిక్ టన్నులను నిల్వ చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలో ఉన్న గోదాములు, నిల్వ సామర్థ్యం పూర్తి వివరాలతో తమ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తున్నాం. ఈ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

గోదాముల వివరాలు (ఎంటీల్లో)

సంస్థ	సామర్థ్యం	నిల్వ ఉంది	ఖాళీ స్థలం
రాష్ట్ర గిడ్డంగులు	18,000	8,000	10,000
మార్కెటింగ్ శాఖ	75,500	66,166	9,334
ప్రైవేట్ గోదాములు	2,40,000	1,65,000	75,000

శివారు.. ముందుకు రారు..!

ఎల్‌ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న ఈ ప్రాంతం కోదాడ పురపాలక పరిధిలోనిది. దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పుర అధికారులే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.




కోదాడలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోదాడ, న్యూస్‌టుడే:

ఎల్‌ఆర్ఎస్ క్రమబద్ధీకరణ పథకాన్ని గత ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టింది. చాలా మంది దరఖాస్తు చేసుకున్నా.. మొదట్లో అవి పరిష్కరించేందుకు జాప్యం జరిగింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. మూడు నెలల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించింది. కానీ క్షేత్రస్థాయిలో ప్లాట్ల యజమానులు తమ దరఖాస్తు పరిష్కారానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

20 శాతమే పూర్తి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో సుమారు రెండు లక్షల వరకు ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 20 శాతంలోపే పరిష్కారమయ్యాయి. చాలా మంది ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం.. పట్టణానికి దూరంగా ఉండటం, శివారు ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం, ఇప్పట్లో ఇంటి నిర్మాణాలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడమే.

★ ఖాళీ స్థలానికి ప్రాంతాల వారీగా ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుంది. చాలా మంది కొన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం, ధర తగ్గడం, ఇప్పుడు ఇళ్లు నిర్మించినా ప్రయోజనం లేదని భావించి ఫీజు చెల్లించడం ఆర్థిక భారం అవుతుందని క్రమబద్ధీకరణకు ముందుకు రావట్లేదు. పట్టణం నడిబొడ్డున, ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు మాత్రమే ముందుకు వస్తున్నారు.

పురపాలికల్లో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు..

పురపాలిక	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్
నల్గొండ	36,116	7,153	21,789
కోదాడ	16,748	3,172	13,576
మిర్యాలగూడ	14,334	6,097	8,237
సూర్యాపేట	35,631	12,392	23,239
హుజూర్‌నగర్	4,414	112	4,300
నేరేడుచర్ల	3,131	127	2,520
తిరుమలగిరి	6,018	1,123	4,880
దేవరకొండ	5,022	242	3,224
నకిరేకల్	6,941	75	5,937
చిట్యాల	3,208	66	2,876
చండూరు	3,619	296	2,831
హాలియా	3,418	135	3,281

అవగాహన కల్పిస్తున్నాం:

– రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారులు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. చాలా మంది ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకుంటే నిర్మాణాలు చేపట్టే సమయంలో ఇబ్బందులు తలెత్తవు. గడువు ముగియక ముందే దరఖాస్తుదారులు ముందుకు రావాలి.

పారదర్శకంగా ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, చిత్రంలో అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి, న్యూస్‌టుడే: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పూర్తయిన పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ఎంబీ రికార్డు నమోదు పనులు, భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులతో బుధవారం సమీక్షించారు. భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణ సర్వే ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక ప్రణాళిక అధికారి శోభారాణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు..

భువనగిరి, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో బుధవారం సమీక్షించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక ముఖ్య ప్రణాళిక అధికారి శోభారాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు

❍ ఉమ్మడి జిల్లాలో 40 కేంద్రాల ఏర్పాటు


భానుపురి, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) సిద్ధమైంది. ఏటా దళారులకు విక్రయించి నష్టపోతున్న రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 40 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. పత్తి సాగు పెరగడంతో కేంద్రాలనూ అధికంగా ఏర్పాటుచేస్తున్నారు. వీటిల్లో రైతులు దూది విక్రయించుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించనుంది. ఈ సారి పత్తికి మద్దతు ధర పెంచి క్వింటాకు రూ.7,521 చెల్లిస్తుండటం అనుకూలించే అంశం.


గతేడాది సూర్యాపేటలోని సీసీఐ కేంద్రానికి రైతులు విక్రయానికి తీసుకొచ్చిన పత్తి (పాతచిత్రం)

వారం రోజుల్లో ప్రారంభం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో ఈసారి అన్నదాతలు పత్తిసాగు చేపట్టారు. ఇప్పటికే మొదటి విడతగా దూది ఏరుతున్నారు. ముందుగా పత్తి ఏరిన కొందరు రైతులు కేంద్రాలు లేక దళారులకు విక్రయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు సీసీఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనూ కొనుగోళ్లు జరిపేలా కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. సరకు తెచ్చిన వెంటనే కొనుగోళ్లు జరిగేలా యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.



పత్తి సాగు (ఎకరాల్లో..)
ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలు

తేమ లేకుండా తీసుకురావాలి

– ఆర్.సంతోశ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే రైతులు తేమ లేకుండా చూడాలి. నాణ్యమైన దూది తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు.

భక్తవత్సలుడికి ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన ఆస్థాన, ఆర్జిత పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలు తెరిచి మూలవరులను హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక తులసీపత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ, సువర్ణ పుష్పార్చన క్రతువు కొనసాగించారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహహోమం మండపంలో నిర్వహించారు. లోక కల్యాణార్థమై శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయాన్ని వెల్లడించారు.

ఆలయోద్యోగికి శ్రీముఖం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రసాద విక్రయ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నగేష్‌కు ఆలయ ఈవో భాస్కర్‌రావు రెండ్రోజుల క్రితం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రసాద విక్రయ విభాగంలో నేరుగా ప్రసాదాలు అందజేసినందుకు షోకాజ్ జారీ చేసినట్లు తెలిసింది. విధుల్లో నిర్లక్ష్య ధోరణి వహించడం వల్లే షోకాజ్ జారీ చేస్తున్నట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు: సునీత

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. బొమ్మలరామారంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో రెండు రోజుల క్రితం ఆటో డ్రైవర్ మహిళపై అఘాయిత్యానికి పాల్పడినా పోలీసులు అతనిపై చర్యలే తీసుకోలేదన్నారు. రాష్ట్రంలోని మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ కరవైందన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. వికారాబాద్ జిల్లాలోని దామగుండంలో భారత నౌకాదళ రాడార్‌ను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ బాల్‌నర్సయ్య, పోలగొని వెంకటేశం ఆంజనేయులు, నర్సింహ, పాపిరెడ్డి, బాల్‌నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేటకు కోర్టు మంజూరు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రామన్నపేటలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని పదిహేడు మండలాల నుంచి పోచంపల్లి, మోత్కూరు, రామన్నపేట, వలిగొండ, అడ్డగూడూరు, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణ్‌పూర్ ఏడు మండలాలతో రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేశారు. ఆయా మండలాలను నూతన కోర్టు పరిధిలోకి చేర్చుతూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏడు మండలాలకు సంబంధించి భువనగిరి సీనియర్ సివిల్‌జడ్జి పరిధిలో ఉన్న సివిల్ దావాలు, క్రిమినల్ కేసులు నూతన కోర్టు పరిధిలోకి రానున్నాయి. నూతన కోర్టును త్వరలో ప్రారంభించేందుకు తాత్కాలిక భవనంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భువనగిరి, బొమ్మలరామారం, బీబీనగర్, ఆలేరు, యాదగిరిగుట్ట, రాజపేట, తుర్కపల్లి, ఆత్మకూరు(ఎం), గుండాల, మోటకొండూరు మండలాల భువనగిరి సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు పరిధిలో కొనసాగనున్నాయి.

యూరియా.. ఎందుకు అమ్మడం లే..!


సహకార సంఘంలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటల సాగుకు వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. వీటిని గరిష్ఠ చిల్లర (ఎమ్మార్పీ) ధరకు లభ్యమయ్యే ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో రైతులు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. పీఏసీఎస్‌లలో అన్ని రకాల ఎరువులు విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు సీఈవోలు పట్టించుకోవడం లేదు. దీంతో దూరంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అధిక ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలతో పాటు రవాణా ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు.

ఉచిత రవాణా సౌకర్యం ఉన్నా..

సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 115 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. ఈ సంఘాలకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులను ఉచితంగా రవాణా చేస్తారు. ఈ అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో 22 సహకార సంఘాల వారు యూరియా తీసుకొచ్చి విక్రయించడం లేదు. దీంతో ఆ సంఘాల పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా విక్రయించాలంటే వారే రవాణా ఖర్చులు భరించి దుకాణానికి తెచ్చుకోవాలి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల వివరాలు

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
పీఏసీఎస్‌లు	43	47	25
ఎరువులు విక్రయించేవి	38	36	19
విక్రయించనవి	5	11	6

కమీషన్‌పైనే దృష్టి

అన్ని సంఘాల్లో డీఏపీ, 20-20, భారత్, ఐఎఫ్ఎఫ్‌సీవో, తదితర ఎరువులను విక్రయించాల్సి ఉంది. కానీ, ఇచ్చిన ఎరువులు మాత్రమే తీసుకోవాలని రైతులకు నిబంధన పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే రూ.కోట్లు కమీషన్ తీసుకుంటున్న సహకార సంఘాల నిర్వాహకులు యూరియా సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కారణాలు ఇలా..

★ గోదాము లేకపోవడంతో ఎరువులకు స్థలం దొరక్క పీఏసీఎస్ నిర్వాహకులు నిల్వ చేసుకోవడం లేదు.

★ యూరియా విక్రయించేందుకు, దిగుమతి, ఎగుమతి నిల్వ వివరాలు రాసుకునే సిబ్బంది, హమాలీలు లేకపోవడం.

★ ప్రభుత్వం నుంచే సరైన (దొడ్డు రకం) యూరియా సరఫరా కాకపోవడం.

విక్రయించాలని ఆదేశించాం

– పద్మ, డీసీవో, సూర్యాపేట

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు విక్రయించాలని ఆదేశించాం. కొన్ని సంఘాల్లో విక్రయించడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే వాటిని తనిఖీ చేసి అందుకు గల కారణాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వచ్చే యాసంగిలో అన్ని సహకార సంఘాల్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

జనవరి 6న తుది ఓటరు జాబితా

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ద్వారా జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన మార్పులు, తొలగింపులు ఈ నెల 29 నుంచి వచ్చే నవంబరు 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

❑ డిసెంబరు 24న మార్పులు తొలగింపులు దరఖాస్తుల పరిష్కారం, జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, తొలగింపుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సెప్టెంబరు 20 నాటికి మొత్తం 13,391 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో 8,605 ఆమోదించబడ్డాయని, 2,407 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలని, వారి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి సమర్పించాలని కోరారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు భట్టు రామచంద్రయ్య, భట్టుపల్లి అనురాధ, కిరణ్‌కుమార్, రత్నపురం బలరాం, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..


భువనగిరిలోని రవాణా శాఖాధికారి కార్యాలయం

ఆలేరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు అవసరం అవుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.

ఉన్నత విద్య కోసం...

ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళుతున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్‌ను తీసుకుంటున్నారు.


భారత్‌లో ఏడాది గడువుతో జారీ అయిన అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (పాతచిత్రం)


అమెరికాలో జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ కార్డు నమూనా


యూఏఈలో జారీ అయిన డ్రైవింగ్‌లైసెన్స్

లెర్నింగ్ లైసెన్స్ మాదిరిగానే..

రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

వీసాను జతచేయాలి..

◆ అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికైతే వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.

◆ వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్యపరంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్లోనే చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్‌ను జారీ చేస్తారు. ◆ నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.

అమెరికాలో ఇలా...

అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాల్సి ఉంటుంది. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించేప్పుడు పక్కన ఎంవీఐ కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన చోదనను పరిశీలించడంతో పాటు ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసేప్పుడు పొరపాట్లు చేస్తే వాటిని రుజువులుగా చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.


'మనం బాగున్నప్పుడు లెక్కలు మాట్లాడి. కష్టాల్లో ఉన్నప్పుడు విలువలు మాట్లాడకూడదు.' – సినీ రచయిత త్రివిక్రమ్


'వ్యాపార నిర్వహణ విషయంలో ఆధిపత్యం, సంపద గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. విలువలు, విశ్వసనీయత పైనే ప్రధానంగా దృష్టి పెట్టాను.' – రతన్ టాటా

విలువలు నేర్పుదాం..!

◆ నేడు 'ప్రపంచ విలువల దినోత్సవం'

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు కేవలం పుస్తకాలు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు, డబ్బే జీవితం అనుకుంటున్నారు. అలా అనుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల మనసులను మార్చేస్తున్నారు. దీంతో కొంత వయసొచ్చాక విద్యార్థులకు మంచి, చెడులు, బంధాలు, బంధుత్వాలు, మానవత్వం.. వంటి వాటిపై విచక్షణ కోల్పోయి.. మరమనిషిలా మారిపోతున్నారు. దీన్ని మార్చాలనే ప్రజలకు విలువల ప్రాధాన్యం తెలిపేందుకుగాను యునైటెడ్ కింగ్‌డమ్ 2016 నుంచి ఏటా అక్టోబరు 17న 'ప్రపంచ విలువల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లోనే బీజం పడాలి..

సమాజం, మానవీయత, బంధాలు, మంచి చెడులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలే అనువైన ప్రదేశం అని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మంచి విలువలు, కట్టుబాట్లు అలవరచడం ద్వారా సమాజంలోని అనేక సామాజిక రుగ్మతలను నియంత్రించడంతో పాటు ప్రస్తుతం వెలుగు చూస్తున్న అనేక నేరాలకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు, తోబుట్టువులు, కట్టుకున్న వారు, పిల్లలు, బంధువులు, మిత్రులతో ఎలా మసలుకోవాలి.. వారి కంటే డబ్బు, ఇతర ఆస్తులు ఏవీ ముఖ్యం కాదనే విషయం విద్యార్థుల్లో బలంగా నాటుకుపోవాలి.

❑ ప్రజల్లో విలువలు దిగజారితే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలు దీనికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొందరు విలువలు మరిచి చేసిన ఘటనలివీ..

❑ వేములపల్లి మండలంలో ఓ భర్త భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను కాలువలో తోసి హత్య చేశాడు.

❑ ఈ ఏడాది మేలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామంలో డబ్బుల కోసం తల్లి అంత్యక్రియలు జరుగకుండా కుమారుడు అడ్డుపడిన ఘటన విస్తుగొలిపింది.

❑ 2021లో సూర్యాపేట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ చదివి విదేశాలకు వెళ్లొచ్చిన ఓ కుమారుడు డబ్బు ఇవ్వలేదని కన్నతండ్రిని బకెట్‌తో కొట్టి హత్య చేశాడు.

❑ 2019లో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంకు చెందిన ఓ తండ్రి భార్యపై కోపంతో నాలుగేళ్ల కుమారుడిని మెడ కొరికి, పిన్నీసులతో గుచ్చి అతి కిరాతకంగా హత్య చేశాడు.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు..

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	4,206
ఆరేళ్ల లోపు చిన్నారులు:	1,64,527
మొత్తం పాఠశాలలు:	3,210
పాఠశాల విద్యార్థులు:	2,11,009
మొత్తం గురుకులాలు:	84
గురుకులాల్లోని విద్యార్థులు:	45,360

ఫోన్‌లో మునిగిపోతున్నారు..



డాక్టర్ రాజశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కోదాడ

సాధారణంగా పిల్లల్లో విలువల పెంపునకు కుటుంబమే కేంద్రం. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండడంతో తల్లిదండ్రులు, తాతలు, నానమ్మ, అమ్మమ్మలు పిల్లలకు నైతిక విలువలు బోధించేవారు. అయితే నేటి పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న నలుగురిలో తలో పనిలో.. ఫోన్‌లో మునిగి పోతుండడంతో చిన్నారుల్లో విలువలు కనుమరుగవుతున్నాయి.

మైహోం సంస్థకు అవార్డు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సిమెంటు తయారీలో ఉన్నత నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు మైహోం ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, భారత ప్రభుత్వ హైదరాబాద్ శాఖ తరపున అందించిన ఈ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందుకున్నట్టు మేళ్లచెరువు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో సంస్థ యాజమాన్యం రాజీ పడలేదన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇండస్ట్రీస్ కమిషనర్ మల్సూర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (హైదరాబాద్) డైరెక్టర్ పి.వి.శ్రీకాంత్ చేతుల మీదుగా సంస్థ సీనియర్ డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.


శ్రీకాంత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మైహోం సంస్థ ప్రతినిధి విజయ్ భాస్కర్‌రెడ్డి

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మానసిక రుగ్మతలతో బాధపడుతున్న విద్యార్థి బలవన్మరణం చెందిన ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన విద్యార్థి(18) భువనగిరిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్ని నెలల నుంచి వోసీడీ అనే మానసిక రుగ్మతతో బాధపడుతూ బీబీనగర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, శవపంచనామా కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపినట్లు సీఐ సాల్మన్‌రాజు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు తక్షణమే చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



నల్గొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు, అధ్యాపకులు

ప్రజా ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఉపకారవేతనాలు, బోధన రుసుములు విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదల జాప్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని తెలిపారు. మూడు ఏళ్లుగా విడుదల కాని ఆర్‌టీఎఫ్‌ల వల్ల అన్ని కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రతి కళాశాల యాజమాన్యం రూ.కోట్లలో అప్పులు తెచ్చి అవి తీర్చలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉమ్మడి జిల్లాలో అనేక కళాశాలలు మూత వేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు రాంమోహన్, నర్సింహ్మారెడ్డి, జానయ్య, సత్యంగౌడ్, ప్రవీణ్, హన్మంతు, వెంకట్‌రెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

మైదానం తోడుగా.. ఉద్యోగ సాధన

★ ఒకే గ్రామంలో 50 మందికి పైగా వ్యాయామ శిక్షకులు


నడిగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

నడిగూడెం, న్యూస్‌టుడే: వ్యాయామ విద్యను అభ్యసించిన 50 మందికి పైగా నడిగూడెం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వ్యాయామ శిక్షకులుగా రాణిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం నడిగూడెంలో దాత కొల్లు పాపయ్య చౌదరి విరాళంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటమే. నిత్యం వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇక్కడ సాధన చేస్తుంటారు. దీనివల్లే ఎక్కువ మంది పోలీస్ కానిస్టేబుల్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పలు వ్యాయామ ఉద్యోగ నియామకాల్లో నలుగురు ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులుగా పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు.

క్రీడలపై మక్కువతోనే...



– పి.ప్రకాశ్, జడ్పీ హెచ్ఎస్, బేతవోలు

గ్రామంలో విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటం, నిత్యం సాధన చేయడంతో పాటు, క్రీడలపై ఉన్న ఆసక్తితో ఉద్యోగం సాధించాను. ఇక్కడ పది, ఇంటర్ పూర్తి చేసిన అనంతరం వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించాను. తోటి యువతకు నిత్యం శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాను.

యువతకు శిక్షణనిస్తున్నా...



– పి.నాగేశ్వరరావు, జడ్పీ హెచ్ఎస్, తుమ్మగూడెం

వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. అందుబాటులో ఉన్న మైదానంలో యువతకు పోలీసు ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. వేసవి సెలవులు, దసరా సెలవుల్లో నిర్వహించే ప్రత్యేక క్రీడా పోటీలకు నా వంతు సహకారం అందిస్తున్నా.

నిత్య కృషితోనే....



కె.సృజన్, మైనార్టీ గురుకుల పాఠశాల, సూర్యాపేట

వ్యాయామ విద్య శిక్షణ పూర్తి చేశాను. పలు ప్రైవేటు, పాఠశాల, కళాశాలల్లో పీఈటీగా విధులు నిర్వహించా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో నిత్యం కృషి చేస్తూ కలను సాకారం చేసుకున్నాను. నిత్య సాధనతోనే ప్రభుత్వ ఉద్యోగం సాకారమైంది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పీడీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందంగా ఉంది...



కె.శ్యామల, మైనార్టీ గురుకుల పాఠశాల, కోదాడ

మైనార్టీ గురుకుల పాఠశాలలో పీడీగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సొంతంగా సాధన చేసి తొలి ప్రయత్నంలోనే సాధించాను. నేటి యువత సాధన చేస్తే ఏలాంటి కొలువునైనా ఇట్టే సాధించవచ్చు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి


మాట్లాడుతున్న పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, చిత్రంలో జాతీయాధ్యక్షుడు స్వామి, తదితరులు

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ ప్రతిపాదనకు పదేళ్లు


పునర్నిర్మాణంతో రూపొందిన యాదాద్రి పంచ నారసింహుల దేవాలయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట స్వయంభూ క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ తలంపునకు గురువారం నాటికి పదేళ్లు నిండనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో యాదాద్రిగా పేరు మార్చి అరెకరంలోని దేవాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి సంపూర్ణంగా కృష్ణశిలతో ఆవిష్కృతం చేశారు. ఆలయంతో పాటు ఇతర వసరులతో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.1200 కోట్లు ఖర్చైనట్లు వైటీడీఏ చెబుతోంది.

★ రాష్ట్ర సాధనకు ఉద్యమిస్తున్న దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్ర సందర్శించారు. ఆలయాన్ని విశ్వఖ్యాతి గాంచేలా పునర్నిర్మించాలని తలచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న వెల్లడించారు. కొండకింది పెద్దగుట్ట పై సేకరించిన 850 ఎకరాలో లేఅవుట్ పనులతో విశాల రహదారులు, హరితమయ ప్రాంగణాలు, కాటేజీల నిర్మాణానికి ప్లాట్ల ఏర్పాటుతో 250 ఎకరాలు రూపుదిద్దుకున్నాయి.

★ కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వసరులతో ఆధ్యాత్మిక వాడగా రూపొందింది. సమీపాన చిన్న కొండ పై వీవీఐపీల బస కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి నిర్మించారు. కళ్యాణ కట్ట, వ్రత మండపం, అన్న ప్రసాదం అందించే సముదాయం, ఆర్టీసీ బస్టేషన్ నిర్మించారు.

★ కొత్తగా కొండపైన భక్తులు నిద్ర చేసేందుకు డార్మిటరీ హాల్, గుండంలో సంకల్ప స్నానం, ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం నిర్వహిస్తోంది.

★ దేవాలయ విమానం స్వర్ణమయం రూపకల్పనకు ఈ మధ్యే శ్రీకారం చుట్టారు. 60 కేజీల బంగారంతో స్వర్ణవిమానం రూపకల్పనకు ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో, స్థానిక ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యాన యాదాద్రి దేవస్థానం సదరు పనులకు నడుం బిగించిన విషయం తెలిసిందే.

పంటకాలానికి రైతు బంధు రూ.7,500 ఇస్తాం

◆ ఈ ఏడాది నుంచే పంటల బీమా అమలు: మంత్రి తుమ్మల


నల్గొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తేమ శాతం పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుబంధు పంట కాలానికి రూ.7,500 ఇస్తామని.. ఈ ఏడాది నుంచే పంటల బీమాను కూడా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నల్గొండలోని ఎస్ఎల్బీసీ మార్కెట్ యార్డులో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఏ పంట వేసినా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

★ గడిచిన 5 ఏళ్లలో బ్యాంకులో రైతు పేరున ఎంత రుణం ఉన్నా.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ మేరకు 22 లక్షల తెల్లకార్డులు కలిగిన రైతులకు ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేస్తూ వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాలో రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామన్నారు. రూ 2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. నల్గొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

★ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికంగా ధాన్యం పండుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకొస్తే రూ.24 గంటల్లో కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం తర్వాత నల్గొండలోనే అత్యధికంగా బత్తాయి సాగవుతుందని.. గతంలో ఏర్పాటు చేసిన బత్తాయి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీని ఏర్పాటు చేయాలని తుమ్మల దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది..

హాలియా: స్థానిక లక్ష్మీనర్సింహా గార్డెన్‌లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

★ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం లాంటి బోగస్ ప్రాజెక్టు కట్టి రాష్ట్రాన్ని రూ.ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేసిందని విమర్శించారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ ఛైర్మన్ పదవి కాదని, అది బాధ్యతని, రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ రైతాంగానికి అండగా ఉండాలని వారు తెలిపారు.


హాలియా: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు

★ ముందుగా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఛాయాదేవి నూతన ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, పీసీసీ డెలికేట్ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా, నందికొండ పురపాలక ఛైర్‌పర్సన్లు యడవల్లి అనుపమరెడ్డి, అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు అధ్వానం



భువనగిరి కోట ప్రాంగణంలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. 2013లో పర్యాటకుల సౌకర్యార్థం నిర్మించినా నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. మరుగుదొడ్లను పర్యాటకులు, సందర్శకులు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. జాతీయ పండుగల రోజు సుమారు 1200 మంది నుంచి 1500 వరకు, సెలవు రోజుల్లో 600 వరకు, నిత్యం 120కి పైగా మంది కోటను సందర్శించేందుకు వస్తుంటారు. వీరి నుంచి ఎంట్రీ ఫీజు రూపంలో గణనీయమైన ఆదాయం లభిస్తున్నప్పటికి సదుపాయాల కల్పనలో పురావస్తుశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. సందర్శకులు చెట్లు, పొదల చాటున కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై ఏడీ నాగలక్ష్మిని ఫోనులో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

– భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ నాయకులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: మూతపడిన ప్రైవేటు డిగ్రీ కళాశాలలను తెరిపించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు మణిపాల్‌రెడ్డి, సింగబోయిన మల్లేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబూజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మూడు రోజులుగా కళాశాలలు మూతపడినప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. బకాయిపడిన బోధన రుసుములు, ఉపకార వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలతో కళాశాలలు నడపలేని పరిస్థితుల్లో యాజమాన్యాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిక్కా ప్రభాకర్ గౌడ్, జహంగీర్, యాకూబ్, పాల్గొన్నారు.

జలాశయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

☛ 'న్యూస్‌టుడే'తో నీటి పారుదల శాఖ చౌటుప్పల్ డివిజన్ ఈఈ కొమ్ము మనోహర్

ముఖాముఖి



చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రజలకు, రైతులకు నీళ్లందించే జలాశయాలను అభివృద్ధి చేయడానికి, కాలువల ద్వారా పొలాలకు నీళ్లందించడానికి నీటి పారుదల శాఖ ద్వారా కృషి చేస్తున్నామని ఆ శాఖ చౌటుప్పల్ డివిజన్ ఈఈ కొమ్ము మనోహర్ 'న్యూస్‌టుడే'కు ముఖాముఖిలో తెలిపారు. 2021లో ఏర్పాటైన చౌటుప్పల్ ఐబీ డివిజన్ పరిధిలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు మండలాల్లో 238 చెరువులున్నాయని.. వీటి కింద 10,484 ఎకరాల ఆయకట్టున్నట్లు వివరించారు.

? చెరువుల్లో ఆక్రమణలున్నట్టు గుర్తిస్తున్నారా?

ఈఈ: డివిజన్‌లో చౌటుప్పల్ మండలంలో 63, సంస్థాన్ నారాయణపురం మండలంలో 76, మునుగోడు మండలంలో 99 నీటి పారుదల శాఖకు చెందిన చెరువులున్నాయి. వీటిలో హెచ్ఎండీఏ పరిధిలో గుర్తించినవి చౌటుప్పల్ మండలంలో 35 ఉన్నాయి. ఈ చెరువులను 2016-17లో సర్వే చేయడం జరిగింది. ప్రభుత్వ తాజా ఆదేశాలతో హెచ్ఎండీఏ పరిధిలోని 35 చెరువులను నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తిస్తున్నాం. వీటి పరిధిలో ఎవరున్నారో పేర్లు, విస్తీర్ణం సహా గుర్తిస్తున్నాం. సర్వే పూర్తి కాగానే ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తాం.

? చెరువుల అభివృద్ధి పనులు చేపట్టారా?

ఈఈ: మునుగోడు మండలం కిష్టాపురం చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.5.35 కోట్లు, సోలిపురం వాగుపై డబుల్ లేన్ రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.04 కోట్లు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ జరుగుతుంది. గొల్లగూడెం బీరప్ప గుడి వద్ద చెక్‌డ్యామ్‌కు ప్రతిపాదనలు తయారు చేశాం. చౌటుప్పల్ మండలంలో మిషన్ కాకతీయ పథకంలో పది చెరువుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. బీరప్పకుంట, సర్వేలు కొత్త చెరువు, కైతాపురం, రాధానగర్‌తండాల్లో కాలువల గండ్లు పూడ్చి వేయించాం. తగినంత వర్షపాతం లేక చెరువులు, కుంటలు చాలా వరకు నిండలేదు.

? పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువల పనులు ఎప్పుడు పూర్తవుతాయి?

ఈఈ: పిలాయిపల్లి కాలువకు 66 కి.మీ. అభివృద్ధికి రూ.102 కోట్లు, ధర్మారెడ్డిపల్లి కాలువకు 55 కి.మీ. అభివృద్ధికి రూ.59 కోట్లు 2016లో ప్రభుత్వం మంజూరు చేసింది. పిలాయిపల్లి కాలువ పనులు రూ.95 కోట్లతో 86 శాతం, ధర్మారెడ్డిపల్లి కాలువ పనులు రూ.21 కోట్లతో 40 శాతం పూర్తయ్యాయి. గుత్తేదారు సంస్థ మిగితా పనులు పూర్తి చేయలేదు. గుత్తేదారు ఏజెన్సీని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024 ఎస్ఎస్ఆర్ ప్రకారం పిలాయిపల్లి కాలువ పూర్తికి రూ.86.22 కోట్లు, ధర్మారెడ్డిపల్లి కాలువ పూర్తికి రూ.123.98 కోట్లు అవసరమని అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. ఇవి పూర్తయితే 40,287 ఎకరాలు మూసీ నదీ జలాలతో సాగయ్యే అవకాశముంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రారంభం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటు నమోదు ప్రారంభమైందని చౌటుప్పల్ ఆర్డీవో, సహాయ రిటర్నింగ్ అధికారి వెల్మ శేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఓటు నమోదు ప్రకటనను బుధవారం ఆయన విడుదల చేశారు. అన్ని తహసీల్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని, అర్హతగల ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకునేందుకు నవంబరు ఆరో తేదీ వరకు అవకాశముందని ప్రకటించారు. నవంబరు 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్, 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్టు తెలిపారు.

పురస్కారానికి ఎంపిక

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరుకు చెందిన ప్రముఖ విద్యావేత్త బండిరాజుల శంకర్ తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ తరపున మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు-2024కు ఎంపికయ్యారు. నాలుగున్నర దశాబ్దాలుగా విద్యారంగంలో చేస్తున్న కృషికి గాను ఈ అవార్డుకు శంకర్‌ను ఎంపిక చేశామని సంస్థ అధ్యక్షుడు డా.ఎం.రాజ్‌నారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్తులో జరగనున్న మహాత్మా గాంధీ జయంతి ముగింపు ఉత్సవాల్లో అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వం

మోటకొండూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుంటుందని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఉమాశేఖర్, శ్రీపతి నరేందర్‌లు అన్నారు. పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వాలను బుధవారం ఆయా పాఠశాలల్లో అందించి మాట్లాడారు. కొత్త ఉపాధ్యాయులు మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పట్ల పరమేష్, రాష్ట్ర అసోసియేట్ మాజీ అధ్యక్షుడు బి.ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, విశ్వరూపం, తదితరులు పాల్గొన్నారు.

రవాణా సదుపాయం మెరుగుపరచాలి

రాజపేట, న్యూస్‌టుడే: మండలంలో ప్రమాదకరంగా లోలెవల్ కాజ్‌వేలు, బ్రిడ్జిలు ఉన్న కారణంగా ప్రయాణం ప్రమాదకరంగా మారిందని భారాస యువజన విభాగం మండల అధ్యక్షుడు పల్లె సంతోష్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంధమల్ల చెరువు నిండి వరద నీరు ప్రవహిస్తున్నందున రాత్రివేళ పొట్టిమర్రి వాగుగుండా ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వరద ఉద్ధృతి కారణంగా బేగంపేట వాగులో తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోవడంతో వారు మండల కేంద్రానికి రావాలంటే గంధమల్ల మీదుగా రావాల్సి ఉంటుందని సంతోష్ వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలంతా శుద్ధి నీటిని తాగాలి



నీటి శుద్ధి ప్లాంటును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మోజిగూడెంలో భాజపా గ్రామశాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫక్కీరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాన్ని గ్రామస్థులతో కలిసి బుధవారం ప్రారంభించారు. భవిష్యత్‌లోను సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామిగౌడ్, దామోదర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీశైలం, లింగస్వామి, కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, మల్లేశ్, కిరణ్‌కుమార్, రవీందర్, పెద్దులుయాదవ్ పాల్గొన్నారు.

మోత్కూరు: ముశిపట్ల ప్రజలంతా శుద్ధి జలాలు తాగి ఆరోగ్యంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డిలు కోరారు. బుధవారం ముశిపట్లలోని శివనగర్‌లో రూ.1.50 లక్షలు దాత ఎగమాటి అరుణ-రాంరెడ్డి స్వచ్ఛందంగా అందించగా, మాజీ సర్పంచి పైళ్ల విజయ-నర్సిరెడ్డి సహకారంతో నిర్మించిన నీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. మాజీ సర్పంచులు తండ సత్తయ్య, కెమిడి సైదులు, మాజీ ఉపసర్పంచి భువనగిరి నర్సింహా, భువనగిరి సత్తయ్య, నాయకులు రమేష్, శ్రీను, సందీప్, రామ్‌రెడ్డి, నరేష్, వెంకటయ్య, దశరథరెడ్డి, సోమనర్సయ్య, ప్రశాంత్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మోత్కూరులో ప్రచారపత్రాలు విడుదల చేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్, తదితరులు

మోత్కూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్ యశోద ఆసుపత్రి వారి యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ, నిరుపేద యువతీయువకులకు మూడునెలల ఉచిత భోజన, వసతులతోపాటు వివిధ రంగాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి సూచించారు. బుధవారం మోత్కూరులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పాటిమట్లకు చెందిన రాజమాత ఫౌండేషన్, స్థానిక ప్రజాభారతి, అభినయ కళాసమితి, యశోద ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎంతోమంది నిరుద్యోగ యువతకు తగిన అవకాశాలు, అవగాహన లేక వృథాగా తిరుగుతున్నారని, వారందరినీ పోగుచేసి ఈ శిక్షణకు పంపిస్తామన్నారు. యశోద ఫౌండేషన్ మేనేజర్ ఎం.శంకర్ మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా తాము ఈ ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు ఫౌండేషన్ ద్వారా కల్పిస్తామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందన్నారు. సమాచారం కోసం సెల్: 8106745673, 8790361631, 8790903410లలో సంప్రదించాలని తెలిపారు. స్థానిక ఎస్సై నాగరాజు, రాజమాతఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, ప్రజాభారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, అభినయ కళా సమితి ఉపాధ్యక్షుడు డి.సతీష్, దేవ, డాక్టర్ మధు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు భాస్కరాచారి పాల్గొన్నారు.

కారును తప్పించబోయి.. లారీని ఢీకొని..

☛ లారీ డ్రైవర్ దుర్మరణం

పెడన, మోత్కూరు, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారిపై పెడన బైపాస్‌లో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న మరో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వరాల వెంకన్న(57), మరో డ్రైవర్ నిమ్మల రామచంద్రయ్యతో కలిసి ఈ నెల 5న మినీలారీతో ఝార్ఖండ్ రాష్ట్రం జెమ్‌షెడ్‌పూర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14న రాత్రి బయలుదేరి 216 జాతీయ రహదారి మీదుగా చెన్నైకు లోడుతో వెళ్తున్నారు. లారీ పెడన తోటమూల సెంటర్ దాటి నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ చేరుకునే సమయానికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటు పక్కనున్న వెంకన్న అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సమయంలో డ్రైవింగ్ చేస్తున్న నిమ్మల రామచంద్రయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లి క్యాబిన్‌లో ఇరుక్కున్న వెంకన్న మృతదేహాన్ని బయటకు తీయించి మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

నిర్మాణాల నాణ్యత పరీక్ష

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలో చేపట్టిన పలు నిర్మాణాల నాణ్యత పరీక్షించేందుకు థర్డ్‌పార్టీ సంస్థ డిసిబుల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సభ్యులు నమూనాలు సేకరించారు. బుధవారం పట్టణంలోని 12, 14 వార్డుల్లో రూ.35లక్షల సాధారణ నిధులతో చేపట్టిన నిర్మాణాలు పరిశీలించారు. సీసీ రోడ్డు, మురుగు కాలువ, మట్టి రోడ్డు, అంతర్గత ముగుగు కాలువ నుంచి నమూనాలు తీశారు. కార్యక్రమంలో ఏఈ మూర్తి, గంగాధర్ పాల్గొన్నారు.

బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయండి

బీబీనగర్, న్యూస్‌టుడే: బీఈడీ అభ్యర్థులతో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేయాలని బీఈడీ విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కి నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, రాబోయే డీఎస్సీలో న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు బీబీనగర్ తహసీల్దార్ శ్రీధర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్జీటీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్‌లో ప్రమోషన్లు ఇవ్వడం వల్ల ఎస్ఏ పోస్టులు తగ్గిపోయాయన్నారు. బీఈడీ అభ్యర్థులకు మాత్రం ఎస్జీటీకి అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీఈడీ అభ్యర్థులు జ్యోతి, సోముమహేష్, దాసరి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పోచంపల్లి అర్బన్ బ్యాంకు ఛైర్మన్ తడ్క రమేష్ సేవలు అభినందనీయమని జిల్లా కాంగ్రెస్ నాయకుడు తడ్క వెంకటేశం అన్నారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లను రూ.1.25లక్షలతో పునర్నిర్మించే పనులు బుధవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహ, లవకుమార్, ప్రవీణ్, అంకం పాండు, శ్రీనివాస్, ఉప్పలయ్య, బాలనర్సింహ, ఎల్లస్వామి పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరణ

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. భువనగిరిలో బుధవారం గోడపత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 21 నుంచి మూడు రోజులు పాటు భద్రాద్రికొత్తగూడెంలో జరిగే మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, నాయకురాలు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు నిర్మాణాల్లో నాణ్యతపై రాజీ పడొద్దని విద్యుత్తు డీఈ సంగం వెంకటేశ్వర్లు అన్నారు. డీఈ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయనను డివిజన్ టీజీఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్తు సరఫరా అవసరాల కోసం చేపట్టే ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, కార్యవర్గ సభ్యులు స్వామి, శ్రీను, మల్లేష్, గోపాల్, రమేష్, ఐలయ్య, రాజు, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

18న ఉద్యోగ కల్పనకు ఇంటర్వ్యూలు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో 30 పోస్టులకు జియో సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత ఉండి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు



నీటి సరఫరాను వివరిస్తున్న జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి శోభారాణి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో నీటి సహాయకులకు(వాటర్‌మెన్) బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మంచి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మంచి నీటి సరఫరాకు శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఈఈ గుండురావు, నీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు. అనంతరం నీటి సరఫరా విధానం డెమో ద్వారా ప్రదర్శించారు.

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ అరుణ, బీబీనగర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రవికిరణ్, బీబీనగర్ గ్రిడ్ ఏఈఈ స్వాతి, ఎంపీవో మాజిద్, సూపరింటెండెంట్ హరిశివకుమార్ పాల్గొన్నారు.

పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వి.కృష్ణ

గుండాల, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా పశువైద్యాధికారి వి.కృష్ణ రైతులకు సూచించారు. బుధవారం బండకొత్తపల్లి, అనంతారం గ్రామాల్లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ప్రత్యూష, ఎండీ.యాకుబ్, వీఏ ప్రవీణ్, గోపాలమిత్రలు గోవింద్, శ్రీను, కృష్ణ, నరేష్, శేఖర్, సోమశేఖర్, పాల్గొన్నారు.

అడ్డగూడూరు: పశువులు, పాడిగేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి కృష్ణ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం పాడిగేదెలు, పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించారు. మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి, వీఎల్ఏ శ్రీరాములు, వీఏ ఈశ్వరయ్య, గోపాలమిత్ర బండి కొమరయ్య, రైతులు పాల్గొన్నారు.

పశుపోషణపై దృష్టి సారించండి.. వలిగొండ: రైతులు పశుపోషణపై దృష్టి సారించాలని మండల పశు వైద్యాధికారి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు, అరూర్, వేములకొండ సుంకిశాల, టేకుల సోమారం గ్రామాల్లో బుధవారం ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు.

ప్రభుత్వ విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్ఆర్ ల్యాబ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జైకేసారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి 12 ఏళ్లుగా విద్యా సామగ్రిని అందజేస్తున్నట్టు ఎస్ఆర్ ల్యాబ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాలను, స్టేషనరీ సామగ్రిని బుధవారం అందజేసి మాట్లాడారు. ఇద్దరు విద్యా వాలంటీర్లకు వేతనాలను ఇస్తున్నట్టు చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఏఏపీసీ ఛైర్మన్ జయశ్రీ, సుభాషిణి పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమకు ముప్పు

రామన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం చేపడితే చేనేత పరిశ్రమకు ముప్పు వాటిల్లుతోందని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రచ్చ యాదటిరి, అప్పం లక్ష్మినర్సు, జెల్లా శ్రీనివాస్, కైరంకొండ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఛైర్మన్

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మన వార్డుకు మన ఛైర్మన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఏడో వార్డులో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజులరెడ్డి, డీఈ కొండల్‌రావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న పుర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఇందిరమ్మ కమిటీలతో ఒరిగేదేమీ లేదు

భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



చౌటుప్పల్‌లో సభ్యత్వం నమోదు చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, ఇందిరమ్మ కమిటీల ద్వారా కొత్తగా ఒరిగేదేమీ లేదని భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లో ఆయన భాజపా కార్యకర్తలతో కలిసి బుధవారం ఇంటింటికీ తిరిగి సభ్యత్వాన్ని నమోదు చేసి మాట్లాడారు. భాజపా పురపాలిక కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్దన్‌రెడ్డి, దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, శ్రీధర్‌బాబు, భిక్షమాచారి, సురేందర్‌రెడ్డి, చిరంజీవి, భిక్షపతి, ఐలయ్య పాల్గొన్నారు.

వలిగొండ: భాజపా వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్నం కపిల్, దంతూరి సత్తయ్య, బచ్చు శ్రీనివాస్, లొడె లింగస్వామి, మారోజు అనిల్, దయ్యాల వెంకటేశం పాల్గొన్నారు.

మోటకొండూరు: మండల కేంద్రంలో భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్షుడు తండ కృష్ణ, నాయకులు ఉట్కూరు అశోక్‌గౌడ్, పీసరి తిరుమల్‌రెడ్డి, చిర్ర రవిందర్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమ కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, దేవేందర్, నర్సింహ, భిక్షం, సంపతి సుధాకర్, గిరి, వెంకటేశంగౌడ్, బీరప్ప, శ్రీను, యాదయ్య, గూడూరు మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.